క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వేల్పూరు రాక

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నేడు పారా గోపయ్య స్మారక ప్రతిభా పురస్కార రజతోత్స వాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని శుక్ర వారం తెలిపారు. విద్యాసేవలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో హైస్కూలు అభి వృద్ధి కమిటీ ఉపాధ్యాయుల సారథ్యంలో ఘనంగా వేడుకలు జరుపుతున్నామన్నారు. 2023 విద్యాసంవత్సరంలో పది, ఏడవ తరగ తి పరీక్షలు అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తా మన్నారు.ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, విశ్రాంత డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, మండ లస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అందరూ పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు వివేకానంద పూర్వ విద్యా ర్థుల కమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతి రావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): మున్సిపల్ సాధారణ సమావేశం పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంట లకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో వాటర్ సప్లయ్, బోర్‌వెల్ మెటీరియల్స్, వాకింగ్ ట్రాక్, రహదారుల నిర్వహణ ఖర్చులు, సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌ల ఏర్పాటు తదితర అభి వృద్ధి పనులకు సంబంధించి మొత్తం 27 అంశాలను చర్చించడం జరుగుతుందన్నారు.

రేపు తహసీల్దారు పదవీ విరమణ సభ

శావల్యాపురం: స్థానిక తహసీల్దారు కార్యా లయం ప్రాంగణంలో ఈ నెల 31న తహసీ ల్దారు షేక్ జాన్‌సైదులు పదవీ విరమణ కార్య క్రమం ఉదయం 11 గంటలకు జరుగుతుం దని డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రెవెన్యూ అధికారులు మండల ప్రజాప్రతిని ధులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆర్‌ఐ పి.నాసరయ్య, వీఆర్వోలు ఉప్పుటూరి చిన మంగయ్య, కరిమూల్లా పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

బొల్లాపల్లి: మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. తొలిరోజు అక డమిక్ మానిటరింగ్ అధికారి పి. శ్రీనివాస రావు పర్యవేక్షించారు. ఉపాధ్యాయుల శిక్షణ లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సంబం ధిత అంశాలను వివరించారు. మండలంలోని 6 పాఠశాలల సముదాయాల సమావేశాలకు చెందిన 10 విభాగాల్లో అంశాలకు సంబంధిం చి చర్చించినట్లు ఈ మేరకు ఎంఈవో-1 సయ్యద్ జఫ్రుల్లా తెలిపారు.

మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ



ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల, కొచ్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థు లకు గంగినేని ఫౌండేషన్ సహకారంతో యూటీఎఫ్ ఎస్‌ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లు శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు అవసరమయ్యే మోడల్ టెస్ట్ పేపర్స్-2024ను దాతల సహకారంతో ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.సీహెచ్. లక్ష్మి, గంగినేని రాఘవ, నూజెండ్ల మాజీ ఎంపీపీ లగడపాటి వెంకట్రావు, గోవిందయ్య, ఉపాధ్యాయులు ఎ.సుబ్బారావు, సీహెచ్.మల్లి కార్జునరావు, మొహమ్మద్ పఠాన్‌ఖాన్, పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి నిర్మాణ వేడుకలు

నాదెండ్ల: మండలంలోని జంగాలపల్లి రెడ్ల బజారులో ఉన్న పునీత ఆరోగ్యనాధుని చర్చి నిర్మాణ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. తూబాడు చర్చి విచారణ గురువు మిల్కిమోర్ రాజా ఆధ్వర్యంలో చర్చిలో దివ్య పూజాబలి నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాయం త్రం తేరు ఊరేగింపు నిర్వహించారు.యువత డప్పు వాయిద్యాలతో బాణాసంచా కాలుస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నదానం నిర్వ హించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటు చేసుకోకుండా నాదెండ్ల ఎస్సై జయరామ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుకాణాలలో తనిఖీలు

నరసరావుపేట రూరల్: పట్టణంలోని నాలుగు ఎరువులు, పురుగు మందుల షాపులపై ఏడీఏ పి.మస్తానమ్మ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రసాద్ ఏజెన్సీ, విజయ ట్రేడర్స్‌తో పాటు మరో రెండు దుకాణాలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు దుకాణదారుడు కలిగి ఉన్నాడా లేదా, కొను గోలుదారులకు బిల్లులు తప్పనిసరిగా ఇస్తున్నా రా అనే అంశాలపై రికార్డులను పరిశీలించారు. సీపీలో ఉన్న స్టాకునే విక్రయించాలని, నిషేధిత వాటిని గుర్తించినా, స్టాక్ వివరాలు, బిల్లు బుక్స్ లేని దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గొరిజవోలులో క్రికెట్ ఆడుతున్న ఎంపీడీవో జాకీర్ హుస్సేన్



బరంపేట గ్రౌండ్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



యడ్లపాడులో క్రికెట్ ఆడుతున్న కారుచోల క్రీడాకారులు



రొంపిచర్లలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

సిక్సర్ కొట్టి.. కబడ్డీ కూతపెట్టి..

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

నాదెండ్ల: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శుక్ర వారం నాలుగోరోజు మండలంలోని 16 సచివాల యాల్లో కొనసాగుతున్నాయి. 20 టీంలు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీ లు బాలురు, బాలికల విభాగాల్లో జరిగాయి. గొరిజవోలులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరై పర్యవే క్షించారు. పంచాయతీ కార్యదర్శి షేక్ అహమ్మద్, సిబ్బంది పర్యవేక్షించారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండల కేంద్రంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా యువతకు శుక్రవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాష హాజరై ప్రసంగించా రు. నాల్గవ రోజు జరిగిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్ర మంలో రేమిడిచర్ల సచివాలయ పరిధిలో 4 క్రికెట్ టీంలు పోటీల్లో పాల్గొన్నాయని, మండలంలోని ప్రతి సచివాలయంలో క్రీడా పోటీల్లో నమోదు చేసు కున్న టీంలు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి యువత పోటీ ల్లో పాల్గొనే విధంగా సచివాలయ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ శివానాయక్, పి.శ్రీహరి, సచివాలయ సిబ్బంది క్రీడా పోటీలను పర్యవేక్షించారు.

నరసరావుపేట: నియోజకవర్గంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆడుదాం...ఆంధ్రా పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. ముందుగా పోటీలకు పేర్లను రిజిస్టర్ చేసుకున్న పలువురు క్రీడాకారులు కేటా యించిన క్రీడా మైదానాల్లో పోటీపడ్డారు. పురపా లక పరిధిలోని క్రీడాకారులు సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియం, బరంపేట మున్సిపల్ హై స్కూలు క్రీడా మైదానం, మున్సిపల్ బాలుర హైస్కూలు ప్రాంగణాల్లో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్ పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు. పట్టణం పరిధిలోని ఆరు నుంచి 11 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు పోటీలకు హాజరైనట్లు సచివాలయాల అడ్మిన్లు వెల్ల డించారు. డీఎస్‌ఏ స్టేడియంలో జరుగుతున్న పోటీ లను పొడా వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, మున్సి పల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ ఆర్‌వో షేక్ జబ్బార్, మేనేజర్, పలువురు పీఈ టీలు పరిశీలించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని 10 సచివాలయాల పరి ధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వ హించారు. కబడ్డీ వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో మొత్తం 22 జట్లు పాల్గొని ఆడాయని ఎండీవో కార్యాలయ అధికా రులు తెలిపారు. గ్రామ సచివాలయల ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలను నిర్వహిం చగా, ఎంఈఓ, ఎండీఓ కార్యాలయ అధికారులు పర్యవేక్షించారు.

యడ్లపాడులో..

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్ని గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఆడుదాం - ఆంధ్రా (ఇది మనందరి ఆట) మెగా టోర్నమెం ట్ పోటీలకు గ్రామాల్లో మంచి ఆదరణ లభిస్తుంది. యడ్లపాడు మండలంలోని 12 సచివాలయాల పరి ధిలో శుక్రవారం ఈ పోటీలు ఎంతో ఉత్సాహంగా కొనసాగాయి. గ్రామ సచివాలయ స్థాయిలో మండ లంలోని 8 క్రీడామైదానాల్లో జరుగుతున్న ఈ పోటీ ల్లో నాల్గో రోజున 14 మ్యాచ్‌లు నిర్వహించారు. జాలాదిలో 2 క్రికెట్, 1 బాడ్మింటన్, కారుచోలలో 3 క్రికెట్, తిమ్మాపురంలో 3 క్రికెట్, వంకాయలపా డులో 4 క్రికెట్, తుర్లపాడులో బాడ్మింటన్ 1 మ్యాచ్ జరిగింది. వీటిలో 12 పురుష, రెండు మహిళా జట్లు పాల్గొని హోరాహోరీగా తలపడ్డాయి. ఆయా క్రీడల్ని వివిధ పాఠశాలల పీఈటీ, పీడీలు నిర్వహిం చగా, మండల పరిషత్, సచివాలయం, పంచాయతీ అధికారులు పర్యవేక్షించారు.

ప్రజాసంఘాల పేరుతో రాజకీయ కుట్ర

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శ

వినుకొండ(నూజెండ్ల): అంగన్‌వాడీలను అడ్డం పెట్టుకొని టీడీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా వందలాది మంది అంగన్‌వాడీ మహి ళలు తన ఇంటి వద్దకు వచ్చారని, ఒక పథకం ప్రకారం ప్రజాసంఘాల పేరు చెప్పుకుని సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు ఆడవాళ్ల వెంట వచ్చి వినతిపత్రం ఇచ్చే సమయంలో కావాలనే తనపై దురుసుగా ప్రవర్తించారని, వారిని వారిస్తున్న తనను అంగన్‌వాడీలను తిట్టానని దుష్ప్రచారం చేశారని, పచ్చమీడియా ఇదే అదునుగా తాను అంగన్‌వాడీల పట్ల దురుసుగా వ్యవహరించా న ని ప్రచారం చేశారన్నారు. వినతిపత్రం ఇచ్చేం దుకు అంగన్‌వాడీలే రావాలని, మీరు తన ఇంటి వద్దకు ఎందుకొచ్చారని ప్రశ్నించినందుకే అనవ సర రాద్ధాంతం చేశారన్నారు. అంగన్‌వాడీలు ఇలాంటి మోసపూరిత రాజకీయ నాయకుల వల లో పడవద్దని, మహిళలు అంటే తమకు ఎంతో గౌరవం ఉందన్నారు. అంగన్‌వాడీలకు మద్దతు పలికితే వారి వద్దకే వెళ్లి నిరసన తెలియజేయాల ని, ప్రజాసంఘాలు తన ఇంటికి ఎలా వస్తారని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

చందాల నాగేశ్వరరావు.. నీచ రాజకీయాలు మానుకో...

అంగన్‌వాడీల వ్యవహారంలో అసత్యప్రచారాలు నమ్మి సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తమ దిష్టిబొమ్మలను దగ్ధం చేయడాన్ని ఎమ్మెల్యే తప్పుపట్టారు. విషయం తెలుసుకోకుండా దిష్టి బొమ్మలను తగలపెట్టడం ఏమిటని, భూపోరా టం పేరుతో వందల ఎకరాలు మసీదు మాన్యం ఆక్రమించుకుని, అమ్ముకొని కోట్ల రూపాయల అక్రమ ఆస్తులను సంపాదించుకున్న ముప్పాళ్లకు తనను విమర్శించేంత స్థాయి లేదన్నారు. ఆందోళనల పేరుతో చందాలు వసూలు చేసుకుని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ వద్ద డబ్బులు తీసుకొని ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిం చడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, తలారి ఆంజనేయులుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

నేడు సచివాలయం ప్రారంభం

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రూ.65 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమా న్ని శనివారం నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యుల కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్ల మెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొంటారని తెలిపారు. వీటితో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలకు ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

శావల్యాపురం: కంది పంట సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతుల ద్వారా సాగు చేయాలని ఏడీఏ బోయపాటి రవిబాబు కోరారు. శుక్రవారం మండలంలోని పోట్లూ రులో కంది పంట సాగు చేసిన పొలాలను పరిశీలించి అనంతరం రైతులతో రైతుభరోసా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఏడీఏ మాట్లాడుతూ కంది సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల, ఈపూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో కం ది పంట సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు కంది పంట కొనుగోలుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్య క్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మండల వ్యవసాయ అధికారి ఆర్. రామారావు మాట్లాడుతూ మండలంలో కంది పైరు పూత దశలో, పిందె దశలో ఉన్నాయని, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ కంది పంట కోతకు వస్తుందని, కంది పంట వేసిన ప్రతి ఒక్క రైతు కూడా ఈ క్రాప్ బుకింగ్ చేసుకో వాలన్నారు.

3న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం లో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ (శీతల గిడ్డంగి కేంద్రం), 1000 మెట్రిక్ టన్నులు గోదాం, జనవరి 3న ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యం లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరుగుతా యన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వ రరావు, వ్యవసాయ సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాం బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జీడీ సీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాం జనేయులు, ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, స్థానిక ప్రజాప్రతినిధులు మండల గ్రామస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల వాసు లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయనతోపాటు సీఈవో జాలాది నాగప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న చెన్నయ్య, నాగప్రసాద్

మూడు గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన

నాదెండ్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు ఆర్‌ఐ షేక్ రమీజా చెప్పారు. మండలంలోని బుక్కాపురం, ఎండుగుంపాలెం, రాజుగారిపాలెం, గున్నావారిపాలెంలో శుక్రవారం ఈవీఎంల పనితీ రుపై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం ద్వారా ప్రజలు ఎలా ఓటు విని యోగించుకోవాలో వివరించారు. ఈవీఎంల పనితీ రును వివరించారు. సీనియర్ అసిస్టెంట్ మురహరి, సర్పంచ్ అల్లడి రవికుమార్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బుక్కాపురంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ రమీజా

చికిత్స పొందుతూ కూలి మృతి

నాదెండ్ల: గణపవరంలోని ఓ ప్రైవేటు స్పిన్నింగ్ మిల్లులో కూలిగా పనిచేస్తున్న వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట పట్ట ణానికి చెందిన బూదాటి హనుమంతరావు (62) భార్య నాగమణితో కలిసి క్వార్టర్స్‌లో నివాసం ఉం టాడు. ఈ నెల 25వ తేదీన ఉదయం టీ తాగేం దుకు క్యాంటిన్‌కు వెళ్లే సమయంలో కళ్లు తిరిగి సొమ్మసిల్లి పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

సచివాలయ వ్యవస్థతో నూతన పాలనకు శ్రీకారం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): సచివాలయ వ్యవస్థ ద్వారా నూతన పాలనకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం లోని చింతలచెరువు గ్రామంలో నూతనంగా నిర్మిం చిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసం గిస్తూ సచివాలయ భవనాలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి పేదప్రజలకు అతిచేరువలో సేవ లు అందిస్తున్నారని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా 1.35 లక్షల మంది సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థకు ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే విధంగా ఈ వ్యవస్థను తీర్చిదిద్దారన్నారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేనివిధంగా ఈ ప్రభుత్వ హయాంలో మెరుగైన సేవలు ప్రజలకు అందుబా టులోకి వచ్చాయని కొనియాడారు. పేదల పక్షపా తిగా వారి అభ్యున్నతికి ఈ ప్రభుత్వం పాటుప డుతోందన్నారు. గతంలో వైఎస్సార్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని, నేడు జగన్‌మోహ న్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సంక్షేమం వర్ధిల్లుతుం దన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథ కాలు ఈ ప్రభుత్వ హయాంలో అందాయన్నారు. వైఎ స్సార్ సీపీ పాలనలో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంక టేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎం పీపీ మేడం జయరామి రెడ్డి, జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, పరిమి శేషయ్య, తన్నీరు ఆంజనేయులు, కంచర్ల బాబు, లేళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.



సచివాలయ భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

అడ్డగోలుగా విమర్శలు చేస్తే సహించం

- నిజాలు తెలుసుకొని మాట్లాడండి
- మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం
- 2024-25 చిలకలూరిపేట బడ్జెట్‌కు ఆమోదం

చిలకలూరిపేట: ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ఏదో ఒకటి విమర్శించాలన్న ఉద్దేశంతో అడ్డగోలు విమ ర్శలు చేస్తే సహించేది లేదని.. వాస్తవాలు తెలుసు కొని మాట్లాడాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహిం చారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఈ సందర్భంగా ప్రవేశ పెట్టారు. బడ్జెట్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని చైర్మన్ కోరారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష టీడీపీ సభ్యుడు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముస్లిం శ్మశాన వాటిక కోసం మంత్రి విడదల రజిని తన సొంత నిధులతో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, సీఎం బహిరంగ సభ సందర్భంగా మూడు ఎకరాల భూమి ఇస్తామని చేసిన వాగ్దానం నెరవేరలేదని విమర్శించారు. ఆటోనగర్ సమకూర లేదని, అభివృద్ధి కుంటుప డిందని ఇలా పలు విమర్శలు చేశారు. దీనికి స్పందించిన మున్సిపల్ చైర్మన్ రఫాని మాట్లా డుతూ ఇప్పటికే మంత్రి విడదల రజిని తన సొంత నిధులు వెచ్చించి రెండు ఎకరాల భూమి కొను గోలు చేసి ముస్లిం పెద్దల పేర రిజిస్ట్రేషన్ కూడా చేయించారని స్పష్టం చేశారు. సీఎం మూడు ఎక రాలు ఇస్తామని ఇచ్చిన హామీ సైతం ప్రాసెస్‌లో ఉందని, కావాలంటే ఆర్డీవోతో స్పీకర్ ఆన్‌చేసి ఫోన్‌లో మాట్లాడి వినిపిస్తానని చెప్పారు. నిజాలు తెలుసుకోకుండా మాట్లాడటం తగదని నిలదీ శారు. ఇక ఆటోనగర్ విషయానికి వస్తే టీడీపీ హయాంలో ఇరిగేషన్ భూములను ఏపీఐఐసీకి స్వాధీనం చేయకుండా కేవలం డ్రామాలతో సరి పెట్టారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక భూమి ఏపీఐఐసీకి స్వాధీనం చేసి, నిబంధనల మేరకు పంపిణీకి అంతా సిద్ధం చేశామని సమాధానం చెప్పారు. నిబంధనల ప్రకారం ఆటోనగర్‌లో ప్లాట్లు పొందాలనుకొనే వారు నామ మాత్రపు ధర ఏపీఐఐసీకి చెల్లించాల్సి ఉం టుందని, అవి చెల్లించవద్దు... తదుపరి తమ ప్రభ త్వం వస్తే ఉచితంగా ఇస్తామంటూ అబద్ధపు ప్రచారం చేసుకుంటూ ఆటోనగర్‌ను అడ్డుకుంటున్నది టీడీపీ వారు కాదా అని నిలదీ శారు.



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న షేక్ రఫాని

విమర్శలు చేయడం తగదు

మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశం జరుగుతుంటే సమావేశానికి సంబంధం లేని విషయాలు, విమ ర్శలు చేయడం తగదని టీడీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగు తున్నాయని, మరికొన్ని వార్డుల్లో అభివృద్ధి ప్రతిపా దనలు ఉన్నాయని, ఇది తెలుసుకోవాలని హితవు పలికారు.

బడ్జెట్ ఆమోదం

2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో భాగంగా రూ. 23.65 కోట్లు ప్రారంభ నిల్వగా, రూ. 57.70 కోట్లు రాబడిగా, రూ. 57.69 కోట్లు ఖర్చు కింద, రూ. 23.66 కోట్లు ముగింపు నిల్వగా అంచనాలు వేశారు.

పిల్లలూ.. భోజనం ఎలా ఉంది?

విద్యార్థులతో నూజెండ్ల ఎంపీడీవో

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ముక్కెళ్లపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికో న్నత పాఠశాలను ఎంపీడీవో వీరభద్రాచారి శుక్ర వారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను పప్పు, అన్నం, కోడిగుడ్లు, చిక్కీలు ఎలా అందుతున్నాయని, నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ పై ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో పలు సూచనలు చేశారు.



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో వీరభద్రాచారి

గణపవరంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పర్యటన

నాదెండ్ల: గణపవరం 1వ సచివాలయాన్ని శుక్రవారం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే భాస్కరరావు సంద ర్శించారు. గ్రామానికి చెందిన దేనువుకొండ లింగ రాజు భూమిని 1978లో ప్రభుత్వం ల్యాండ్ ఎక్విజిషన్ చేసింది. సర్వే నెం.67లో వీరి కుటుంబానికి 2.50 ఎక రాల విస్తీర్ణం ఉంది. మొదటి విడతలో 68 సెంట్లు విస్తీ ర్ణాన్ని తీసుకోగా, రెండో విడతలో 87 సెంట్లు విస్తీర్ణం తీసుకున్నారు. రెండు విడతలు పోను 1.15 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సి ఉంది. అయితే లింగరాజు కుటుంబ సభ్యులు మొదటి విడతలో 68 సెంట్లకు మాత్రమే ప్రభుత్వం తమకు పరిహారం ఇచ్చిందని, రెండో విడతలో తీసుకున్న 87 సెంట్లు విస్తీర్ణానికి పరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. 68 సెంట్లు పోను 1.82 సెంట్లు మిగులు భూమిని తమకు అప్పగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఐ భాస్కరరావు విచారించారు. ఆయనతో పాటూ మం డల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు ఉన్నారు.



లింగరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఐ భాస్కరరావు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

చిలకలూరిపేట: పట్ట ణంలోని భగత్‌సింగ్ రోడ్డు ప్రాంతానికి చెందిన సయ్యద్ రహంతుల్లా చిన్న వయసులోనే అనారో గ్యానికి గురై ఆసుప త్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందా డు. ఆయనకు భార్య, ఇరువురు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎ స్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు మృతుడి నివాసానికి చేరుకొని భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి చిన్న పిల్లలు ఉన్న నేపథ్యంలో మృతుడి కుటుంబానికి రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం అందజే శారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



రహంతుల్లా భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు